పూజించే
దేవుడిపేరు చెప్పి
పొడిచి చంపే
అమానుషం
ఈ మనుషుల్లో
ఇంకా ఎంతకాలం?




# ఈశ్వర అల్లా తేరేనామ్

సమయం : రాత్రి పదకొండున్నర గంటలు.
స్థలం : హైదరాబాదులోని ఒక చీకటి ఇరుకు గల్లీలో ఒక కప్పు కూలిపోయి శిథిలావస్థలో వున్న ఒక పాత పెంకుటిల్లు.

ఆ సమయంలో ఆ ఇంట్లో ఒక యువకుడు వంచిన తల ఎత్తకుండా, దీక్షగా పని చేస్తోన్నాడు.

ఆతని చేతిలోని కత్తెర ఎంతో లాఘవంగా చకచకా కదులుతూంది— వంపు సొంపులు పోతూంది.

సాదా రంగు కాగితాలూ, అతి సున్నితమైన తళుకు కాగితాలూ. క్షణంలో అతని చేతిలో పువ్వులుగా, లతలుగా, చిత్రవిచిత్రమైన డిజైన్లుగా మారుతూ ఉన్నాయి.

అతనితో పాటు మరో ఇద్దరు కుర్రాళ్లు కూడ పన్జేస్తున్నారు

ఒక కుర్రవాడు మేదరబద్దతో చేసిన బుట్టలకూ, ఆర్చిలకూ రంగు కాగితాలు అంటిస్తోన్నాడు. రెండోవాడు వాళ్ళ మేస్త్రీ కత్తిరిస్తోన్న పూలనూ, నగిషీ డిజైన్లనూ వాటికి అంటబెట్టుతున్నాడు.

ఆ యువకుని పేరు రహీం.

రంగుకాగితప్పనిలో రహీంకు రహీమే సాటి!

వినాయకచవితి పండళ్ళకు రహీం రంగు కాగితప్పని చేస్తేగాని పండుగ కళ రాదు రహీం కట్టిన పూల మంటపంలో గాని సిద్ధి వినాయకుడు నిండుగా ఠీవిగా కూర్చోడు. రహీం కట్టిన పూలరథం లేకపోతే నిమజ్జనానికి రానని వినాయకుడు మారాం చేస్తాడు



రహీం రంగు కాగితపు పని లేకపోతే శ్రీరామనవమి పందిళ్ళు వెలవెలాపోతాయి

ఇక దసరా పండుగకు సరేసరి!

పోచమ్మగానీ, పోశీరమ్మగానీ, బతకమ్మ గానీ, మహంకాళమ్మ గానీ...ఆ గుడిలో రహీం తయారుచేసిన రంగు కాగితపు దీపంబుడ్లు వెలగవల్సిందే! అతడు చేసిన రంగు కాగితాల తోరణాలు ఎగరవల్సిందే!

ఇక హిందువుల పెళ్ళిళ్ళకూ, పేరంటాలకూ రహీం చేసే పెళ్ళిమంటపాల సంగతి చెప్పక్కర్లేదు!

రహీం వుండే బస్తీలోగాని, ఆ చుట్టు ప్రక్కలగానీ, జరిగే ప్రతి హిందువుల

పండుగలకు పబ్బాలకూ- పెళ్ళిళ్ళకూ పేరంటాలకూ అతను చేసిన రంగు కాగితప్పని తప్పనిసరిగా ఉండవల్సిందే!

రంగు కాగితప్పని రహీంకు వుగ్గులో పెట్టిన విద్య! ఒక విధంగా ఇది అతని కులవృత్తి!

రహీం తండ్రి గఫూర్ కూడ ఇదే పని చేసేవాడు. గఫూర్‌కు ఈ చేతిపనీ తాతల కాలంనాటి ఆ పాత పెంకుటిల్లూ తప్ప ఇంకేమీ లేవు!

గఫూర్ పోతూ కొడుక్కి ఈ రెండూ ఇచ్చిపోయాడు

రహీం, తన తండ్రి నేర్పిపోయిన ఈ విద్యనే నమ్ముకొని దీన్నే తృప్తిగా జీవనోపాధిగా పెట్టుకొని తండ్రి ఇచ్చిపోయిన ఆ పాత ఇంట్లోనే ఎట్లాగో కాలం వెళ్ళబోస్తున్నాడు

వినాయకచతుర్థికి, దసరా, దీపావళీ లాంటి పెద్ద పండుగలు వస్తే రహీంకు కూడా పండగే ఈ పండుగలు హిందువులకు ఎంత ముఖ్యమో-రహీం కూడా అంత ముఖ్యమే!

వాళ్ళు డబ్బులు సంపాదించేది పాత అప్పులు తీర్చేది క్రొత్తగుడ్డలు కుట్టించుకునేది-రెండు పూటలా కడుపునిండా ఇంత తిండి తింటూ నిశ్చింతగా ఉండేది ఈ పండుగలప్పుడే!

రహీం కత్తిరిస్తున్న కత్తెర ప్రక్కన పెట్టి వ్రేళ్ళు విరుచుకొని-బద్ధకంగా ఆవలించాడు.

వినాయకచవితి పండుగ మూలంగా పని ఎక్కువగా వుంది వారం రోజుల్నుంచీ రోజూ రాత్రుళ్ళు పన్జేస్తున్నాడు. ఈ వారంగా సరిగ్గా నిద్రలేక కళ్ళుమూతలు పడుతున్నాయి. నిద్ర ముంచుకొస్తోంది. టీ త్రాగితేగాని ఆగేటట్లు లేదు

చొక్కా తొడుక్కొని పని కుర్రాళ్ళతో చెప్పి టీ తాగటానికి బయలుదేరాడు.

ఆ చీకటి ఇరుకు గల్లీలోంచి నడుస్తూ చాదర్‌ఘాట్ బ్రిడ్జి వైపు పోతున్నాడు.

వీధి దీపాలు అక్కడొకటీ ఇక్కడొకటీ వెలుగుతున్నాయి. వీధి కుక్కలు వుండివుండీ మొరుగుతున్నాయి.

రహీం వెళ్ళేసరికి యాదగిరి టీకొట్టు ఖాళీగా వుంది

టీ త్రాగుతుండగా బలరాం వచ్చాడు.

బలరాం కూడా వాళ్ళ బస్తీయే దర్జీ పని చేస్తుంటాడు.

రహీం వాళ్ళ గల్లీలోనే వుంటాడు. ఇద్దరూ చిన్నప్పట్నుంచీ స్నేహితులు. కలిసి ఆడుకున్నారు. కలిసి చదువుకున్నారు. వాళ్ళ కుటుంబ ఆర్థిక స్థితి బాగోక యిద్దరూ వీధి బడితోనే చదువులు ఆపేశారు ఎవరి వృత్తులు వాళ్ళు చేపట్టి ఎలాగో కాలం నెట్టుకొస్తున్నారు.

బలరాం టైలర్‌షాపు ముస్లింల వాడ కట్టులో ఉంది. వాళ్ళ బట్టలన్నీ అతనే కుట్టుతుంటాడు. ముస్లింలు ధరించే షేర్వాణీలు, కుర్తాలూ కుట్టడంలో బలరాం బహు నేర్పరి! ఆడవాళ్ళ బట్టలూ, పిల్లలగౌనులూ కూడ అందంగా కుట్టుతాడు

బలరాంకు వాళ్ళ బస్తీ ముస్లింల గిరాకీ ఎక్కువ.

బక్రీద్, రంజాన్ పండుగలు వచ్చాయంటే అతనికి చేతినిండా పని!

ముస్లింల పండుగలు బలరాంకు కూడ

పండుగలే! చేతినిండా పనివుంటే పండుగే మరి!

రానున్న బక్రీద్ పండుగ గిరాకీ కోసం బలరాం కూడ వారం రోజులుగా రోజూ రాత్రిళ్ళు పన్జేస్తున్నాడు. రహీంలాగే టీ త్రాగడానికి వచ్చాడు ఇప్పుడు.

"క్యా రాం భాయి! కామ్ కైసా ఐ" అని రహీం పలకరించాడు

మిత్రులిద్దరూ ఇలా కలిసినప్పుడల్లా ఆప్యాయంగా పలకరించుకుంటారు. కష్టం సుఖం చెప్పుకుంటారు. వాళ్ళ బస్తీలో వాళ్ళిద్దరూ అన్నదమ్ముల్లాగా ఉంటారు

రహీం అడిగిన దానికి బలరాం-

"మీ బక్రీదు పండుగ మూలంగా నా పని బాగానే ఉంది రహీం! అంతా మీ అల్లా దయ" అన్నాడు.

"మీ వినాయకచవితి పండుగ వల్ల నా పనీ బాగానే ఉంది రాంభయ్యా. అంతా మీ ఈశ్వర్ 'దువా' అని అన్నాడు రహీం

ఇద్దరూ నవ్వుకున్నారు.

స్నేహితులిద్దరూ టీత్రాగి, బయటికి వచ్చారు. పాన్ వేసుకున్నారు.

ఇంతలో షరీఫ్ కనిపించాడు.

పాన్‌షాపు ప్రక్కన- బండిలో అరటి పళ్ళు అమ్ముతున్నాడు. బండిలో ఆఖరి గెల ఉంది. ప్రక్కనే ఇంకా విప్పని చేమంతి పూలబుట్టలు ఉన్నాయి.

షరీఫ్‌ది కూడా వాళ్ల బస్తీయే! బండిలో పూలూ, పండ్లు పెట్టుకుని ఇళ్ళ వెంట తిరుగుతూ అమ్ముతుంటాడు. ఒక్కోసారి కూరగాయల బండి వేస్తాడు. చౌగ్గా ఉంటే ఉల్లిగడ్డలూ, చింతపండూ గట్రా అమ్ముతుంటాడు

మిత్రులిద్దరూ షరీఫ్‌ని పలకరించారు. షరీఫ్ చాల ఉషారుగా వున్నాడు.



వచ్చేవన్నీ పండగరోజులు, ముందుగా వినాయకచవితి-తర్వాత దసరా-ఆ తర్వాత దీపావళీ! ఈ పండగ రోజుల్లో తనకి గిరాకి. పూలబండి వేసినా, పండ్ల బండి వేసినా, వినాయకచవితి బొమ్మలు అమ్మినా—నాల్గు బజారులు ఇలా తిరిగే సరికి-బండి మొత్తం ఖాళీ అవుతుంది. చేతినిండా నాల్గు డబ్బులు ఆడుతాయి

ఈ దెబ్బతో వడ్డీలకు వడ్డీలు మింగేస్తోన్న అప్పుల్లోంచి బయటపడుతానని ధీమాగా అన్నాడు

"మేమూ ఈ పండుగలమీదే ఆశలు పెట్టుకొని వున్నాం తమ్ముడూ" అని అంటూ మిత్రులిద్దరూ తమ బస్తీవైపు నడిచారు

ప్రక్కనున్న దుకాణం అరుగుల మీద చీకట్లో కొందరు పడుకొని ఉన్నారు వాళ్ళంతా—యాచక వృత్తిమీద బ్రతికే దరిద్ర నారాయణులూ, కుంటివాళ్ళూ, గ్రుడ్డి వాళ్ళూ, కుష్ఠు వాళ్ళూ...

ఆ సమయంలో కుష్ఠు ఏసూబూ, వాడి భార్యా మల్లమ్మా రానున్న బక్రీదు పండగ గురించి కమ్మనికలలు కంటున్నారు.

పండుగ రోజుల్లో ముస్లింలు బీదసాదలకు ధారాళంగా దానధర్మాలు చేస్తారు. మసీదుల బయట గుడ్డ పరచుకొని కూర్చుంటే కనకవర్షం కురుస్తుంది. చిల్లర డబ్బులతో బొడ్డు సంచులు నిండుతాయి. కొంగుముడులు పొంగుతాయి

మన పండుగలూ పబ్బాలూ వెనుక అంతర్లీనంగా వున్న ఆర్థిక సూత్రం ఇదే మరి!

బలరాం జరుపుకునే దసరా పండుగకు రహీం రంగు కాగితప్పని చేసి నాల్గు డబ్బులు చేసుకుంటాడు

రహీంవాళ్ళ బక్రీదు పండుగకు బలరాం బట్టలు కుట్టి డబ్బులు సంపాదిస్తాడు.

వినాయకుని బొమ్మలూ, పూలు.పండ్లూ అమ్మి షరీఫ్ నాల్గు రాళ్ళు వెనకేసుకుంటాడు.

పండుగనాడు ముస్లింలు చేసే దానధర్మాలమీద ఆశలు పెట్టుకొని వున్నారు ఏసోబూ, మల్లమ్మలూ!

ఒకరి పండుగ మరొకరికి జీవనాధార హేతువు అవుతుంది!

ఈ పండుగలూ, పబ్బాలూ సర్వమత సహజీవనానికి సంకేతాలు! పరమత సహిష్ణుతకు ప్రథమ సోపానాలు!

హిందూ ముస్లింలూ ఒకరి మతాన్ని మరొకరు మన్నిస్తూ, సోదరభావంతో సహజీవనం సాగిస్తోన్న సమాజం మనది! ...కాని మరి అదేం పాపమో, ఇదేం శాపమోగానీ-ప్రతి యేడూ ఈ పండుగల పర్వదినాలల్లోనే నగరంలో అశాంతి చెలరేగుతుంది

కొందరు స్వార్థపరులూ, నరరూప రాక్షసులూ, మతోన్మాదులూ-ఈ పండుగల కోసమే కాచుకుని వుంటారు!

మతం పేరిట మారణకాండ చేయటానికి కుట్రలు పన్నుతూ వుంటారు; వెన్నుపోట్లు పొడవటానికి పొంచివుంటారు; మతకలహాలు సృష్టించి హత్యాకాండ సాగించటానికి కత్తులూ కటార్లూ నూరుతూ వుంటారు!

ఈ యేడూ అదే జరిగింది!

ఈ స్వార్థపరులూ, ఈ నరరూప

రాక్షసులూ, ఈ మతోన్మాదులూ మళ్ళీ విజృంభించారు

మళ్ళీ కత్తులూ కటార్లూ దూశారు.

మళ్ళీమళ్ళీ వెన్నుపోట్లు పొడిచారు

తాము సాగించే ఈ దారుణమారణ కాండకు 'మతం' అనే రంగు పులిమారు.

మతాన్ని అడ్డుపెట్టుకొని సంఘవిద్రోహ శక్తులు స్వైరవిహారం చేశాయి, హింసా కాండను సాగించాయి

వృద్ధులనిలేదు, స్త్రీలనిలేదు, బాలురని లేదు-ఎవరు కనిపిస్తే వాళ్ళను, ఎవరు దొరికితే వాళ్ళను తమ కసాయి కత్తులకు ఎరచేశారు

ఎక్కడ చూచినా, ఎక్కడ విన్నా కత్తిపోటు సంఘటనలే!

ఇంటినుండి బజారుకెళ్ళటానికి భయం! బజార్నుంచి యింటికి రావటానికి భయం! ఎక్కడికెళ్ళాలన్నా భయం! ఎక్కడికి రావాలన్నా భయం!

ఎదుటివాడ్ని చూస్తే భయం! వెనుక వాడ్ని చూస్తే భయం! ప్రక్కవాడ్ని చూస్తే భయం!

ఈ భయంలోనే, జంట నగరవాసులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని, బతుకు గుండెలలో ఎట్లాగో ఈ పండుగ లను జరుపుకున్నారు.

పండుగలు అయిపోయినా విద్రోహ చర్యలు ఆగలేదు, మతవైషమ్యాల మంట చల్లారలేదు.

మతోన్మాదం పురివిప్పి విలయతాండవం చేస్తూనే వుంది! కత్తిపోటు సంఘటనలు జరుగుతూనే వున్నాయి-మృతుల సంఖ్య పెరుగుతూనే వుంది. హతుల అంకె ఎవరికీ అందటంలేదు!

ఇకపోతే-బలరాం, రహీంలు వుంటున్న బస్తీలోకూడ పరిస్థితి అలజడిగానే వుంది.

నిన్నటిదాక ప్రాణమిత్రులుగా మెలగి, భాయి-భాయీ అనుకున్న బలరాం రహీంలు ఎడమొగం పెడమొగంగా వుంటు న్నారు.

ఒకరికొకరు ఎదురుపడితే ఇదివరకు లాగా ఆప్యాయంగా పలకరించుకోవటం లేదు.

ముక్తసరిగా, ముభావంగా, మొక్కు-

## ఇద్దరు భార్యలు



"ఇద్దరు పెళ్ళాలుంటే అందులో ఓ సుఖం వుందోయ్" అన్నాడు భగవంతం.

"ఏవిటి?" అడిగాడు ముకుందం.

"వాళ్ళలోవాళ్ళు పోట్లాడుకోవడం తప్పితే మనతో దెబ్బలాడడానికి వారికి తీరికదొరకదు" చెప్పాడు భగవంతం.

–మంత్రాల (శ్రీకాకుళం)

బడిగా ఏదో రెండుమూడు ముక్కలు మాట్లాడి దాటిపోతున్నారు

ఇలా వుండగా—ఆ రోజు జరిగిన ఆ సంఘటనతో పరిస్థితి మరీ వికటించింది. మిత్రులిద్దరిమధ్యా శత్రుత్వం తావు చేసుకుంది!

ఇంతకూ ఆ రోజు ఏం జరిగిందంటే—

మనిషి-క్షణంలో కోట్లకొలది సంవత్సరాల వెనక్కి వెళ్ళిపోయి, మళ్ళీ అనాది మానవుడుగా, మృగప్రాయుడుగా మారిపోయి—తన సాటిమనిషిని పీక్కొని తినగలడు, క్షణంలో తను కనిపెట్టిన మారణాయుధాలతో ఈ భూమి తలంమీద వున్న సర్వప్రాణికోటినీ అంతం చేయగలడు

కాని-వీడు చేయలేనిదిమాత్రం ఒక్కటి వుంది. ప్రొద్దు పొడవటాలనూ, ప్రొద్దు కుంకటాలనూ మాత్రం ఆపలేడు

అందుకే ఆ సాయంత్రంకూడ మామూలుగానే ప్రొద్దు కుంకింది.

మన భాగ్యనగరము మీదకు రావటానికి ఆ చందురుడికికూడ భయమే! తననికూడ ఎవడొచ్చి పొడుస్తాడో, ఎటొచ్చి నరుకుతాడో అని-మబ్బులు చాటుచేసుకుని భయం భయంగా వచ్చాడు

ఆ చందురుడంతటివాడే భయంతో హడలిచస్తోంటే ఇక చుక్కలు ఒకలెక్కా! భయంతో చుక్కలన్నీ బిక్కుబిక్కుమంటున్నాయి

అట్టి సమయంలో—

రహీంవాళ్ళ బస్తీలో—ఒక రొట్టెల దుకాణం-పంచలో-యాదమ్మా, రాజమ్మా, మల్లమ్మా, సావిత్రీ, సత్యవతీ—మొదలగు వారు చంటిబిడ్డలతో, చంకబిడ్డలతో కూర్చున్నారు.

ఒక పాప ఒళ్ళు జ్వరంతో కాలిపోతూంది

ఒక చిన్నారి వుండి వుండి వూరికే వులిక్కి వులిక్కిపడుతూంది.

ఒక పసిది తల్లి రొమ్ము కుడవదు, వూరికే పోరుపెడుతూంది.

ఒక ముసలాడు రాత్రుళ్ళు వూరికే కలవరింతలు, పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు...

అప్పుడు ఆ రొట్టెల దుకాణం యజమాని బేరం చూచుకుంటున్నాడు...

అతను డెబ్బైయ్యేళ్ళు పైబడ్డ వృద్ధుడు. జరాభారంతో నడుం వంగిపోయింది, గడ్డం తెల్లగా పండిపోయింది.

అతని పేరేదో వుంది కాని ఆ బస్తీ వాళ్ళంతా అతడ్ని ఫకీరయ్యా అంటారు.

ఫకీరయ్యా ముస్లింలో బహుధార్మికుడు. ఎల్లప్పుడూ 'అల్లా' నామస్మరణ చేస్తూ వుంటాడు.

ఫకీరయ్యా 'అల్లా' పేరు చెప్పి మంత్రం వేస్తే—చంటిబిడ్డల బాలారిష్టాలూ, జ్వరాలు. రుగ్మతలూ చేత్తో తీసేసినట్లు పోతాయి.

ఫకీరయ్యా చేత్తో విభూతి పెట్టితే వూరికే పోరుపెట్టే పసిపాపలు హాయిగా నిద్రపోతారు

అతడు ఆదివారంనాడు 'అల్లా' పేరుమీద 'అంత్రం' కడితే అది 'గాలి' అయినా, 'ధూళి' అయినా ఇట్టే ఎగిరిపోతుంది

ఎవరిదగ్గరా ఒక్కపైసాకూడ తీసుకోడు

ఆ బస్తీలో చంటిబిడ్డల తల్లులకు

ఫకీరయ్య దేముడే!

ఫకీరయ్య మంత్రంకోసం, చీకటి పడగానే బిడ్డల్ని ఎత్తుకుని వచ్చి ఆ రొట్టెల దుకాణంముందు కాసుకొని కూర్చుంటారు.

ప్రక్క గల్లీలో వున్న మస్జిద్‌లోంచి నమాజుకు పిలుపు వినిపించింది

ఫకీరయ్య తన చిన్న మనమడుకు దుకాణం అప్పగించి మస్జిద్‌కు బయలు దేరాడు నమాజ్ చేసుకుని రాగానే పిల్లలకు మంత్రాలు వెయ్యటం మొదలు పెడతాడు

దుకాణం మెట్లు దిగుతూ యాదమ్మను చూచి ఫకీరయ్య పలకరించాడు.

యాదమ్మ అతన్ని ఎప్పుడూ 'ఫకీరన్నా' అంటుంది

మిగతావారితో "మస్జిద్‌కు వెళ్ళివస్తా తల్లీ! మీ బిడ్డలందరికి ఆ అల్లా 'దువా' కోసం ప్రార్థన చేసివస్తానమ్మా!" అని, మెల్లగా అడుగులు వేసుకుంటూ ప్రక్క గల్లీలోకి మళ్ళాడు.

ఫకీరయ్య వెళ్ళి రెండు నిమిషాలు దాటిందో లేదో 'అరే అల్లా!' అంటూ అతడు చేసిన ఆర్తనాదం ప్రక్క గల్లీ లోంచి హృదయవిదారకంగా వినిపించింది.

యాదమ్మ కంగారుగా పరిగెత్తింది. ఫకీరయ్య రోడ్డుమీద పడిపోయాడు.

'అల్లా-అల్లా' అంటూ బాధతో గిలగిలా కొట్టుకుంటున్నాడు.

ఫకీరయ్యను పొడిచిన దుర్మార్గుడు చీకట్లో పారిపోయాడు.

యాదమ్మ పెట్టిన కేకలకు మిగతా ఆడవాళ్ళంతా పరుగెత్తుకుంటూ వచ్చారు.

ఆడవాళ్ళ ఆర్తనాదాలకు మిగతా జనమంతా మూగారు

ఈ వార్త క్షణాల్లో బస్తీ అంతా కారు చిచ్చులాగా వ్యాపించింది. బస్తీ అంతా కుతకుత వుడికిపోయింది!



## పాలంటే భక్తి

మధ్య ఆఫ్రికాకు చెందిన మసాయి జాతివారికి ఆవుపాలంటే ఎంతో దైవభక్తి! ఆ జాతివారు పాలను కాయరు! ఏరకంగానూ వాటిరూపును మార్చరు! అలా చేస్తే తమకు పాపంవస్తుందని వారి భయం! అంతే కాదండోయ్! మసాయి జాతివారు...మాంసం తిన్న రోజున...ఎట్టి పరిస్థితులలోనూ ఆవుపాలను తాగరు!

ఎలాగూ పాలగురించి చెప్పుకొంటున్నాం కాబట్టి...ఓ చిన్న రికార్డుకూడా చెప్పుకొందాం 1979వ సంవత్సరం మార్చి 24వ తేదీన అమెరికాకు చెందిన హోలింగ్‌వర్త్ నెత్తిమీద పాలతో నింపిన సీసాను ఉంచుకుని బ్యాలన్స్ చెడకుండా.... ముప్పై కిలోమీటర్లదూరం నడిచి గిన్నీస్ ప్రపంచరికార్డుల పుస్తకంలోకి ఎక్కేశాడు!

- జూపిటర్

ఆ మర్నాడు ఇంతకంటే దారుణం మరొకటి జరిగింది !

ఉదయం ఏడుగంటలప్పుడు-లచ్చమ్మ షరీఫ్ బండిదగ్గర కూరగాయలు కొంటుండగా ఆ దారుణం జరిగింది.

ఎవడో ఒక దుండగుడు సైకిలుమీద వేగంగా లచ్చమ్మ ప్రక్కనుంచిపోతూ కత్తితో ఆమె మెడమీద బలంగా గాయం చేసి పారిపోయాడు.

షరీఫ్ కేకలుపెట్టి అరుస్తూ సైకిలు వెనుక పరుగెత్తాడు. కాని అప్పటికే ఆ దుర్మార్గుడు ఆ చిన్న చిన్న గల్లీల్లోంచి తప్పించుకొని ఎటో పారిపోయాడు

షరీఫ్ పెట్టిన కేకలకు జనం పోగయ్యారు.

లచ్చమ్మ క్రింద కూలిపోయింది. బాధతో గిలగిల్లాడిపోతూంది...

షరీఫ్‌కు కాలు చెయ్యీ ఆడటంలేదు. మనిషి వూరికే బెంబేలు పడిపోతున్నాడు.

షరీఫ్ లచ్చమ్మను ఎప్పుడూ 'లచ్చమ్మక్కా !' అని పిలుస్తుంటాడు.

లచ్చమ్మంటే అతనికెంతో అభిమానం పోయినయేడు ఇలాగే మతకలహాలు రేగినప్పుడు కొంతమంది మతోన్మాదులు-సంఘవిద్రోహులూ షరీఫ్ యింటిమీదకు దాడిచేశారు అతని పెళ్ళాంబిడ్డల్ని చంపబోయారు. అప్పుడు లచ్చమ్మ తన ప్రాణాలకు సహితంతెగించి వాళ్ళకు అడ్డుపడింది. ముందు నన్ను చంపి తర్వాత వాళ్ళను చంపండి అని తన ప్రాణాలొడ్డి ఎదురు నిలబడి షరీఫ్ పెళ్ళాంబిడ్డలను కాపాడింది.

అందుకే షరీఫ్‌కు లచ్చమ్మంటే అభిమానం, కృతజ్ఞతాన్నూ!

షరీఫ్ బండిని ప్రక్కకు వంచి కూరగాయల్ని రోడ్డుమీదకు దొర్లించేశాడు

లచ్చమ్మను ఎత్తి బండిమీద పడుకోబెట్టాడు.

'మా లచ్చమ్మక్కను సంపేశారో !' అని ఆవేశంగా అరుస్తూ, బూతులుతిట్టుతూ బండిని త్రోసుకుంటూ ఆసుపత్రివయిపు వెళ్ళాడు...

ఈ దారుణం జరిగినప్పుడు బలరాం వూళ్ళోలేడు ఏదో పనివుండి సంగారెడ్డికి వెళ్లాడు.

ఊర్నుంచి అతను యింటికి తిరిగి వచ్చేసరికి చీకటిపడింది.

అతని రాకకోసమే ఎదురుచూస్తోన్న కొందరు స్వార్థపరులు అతడు వూళ్ళోకి వచ్చాడని తెలియగానే అతనింటికి వెళ్లారు.

లచ్చమ్మను పొడిచిన సంఘటనకు 'మతం' అనే రంగుపూసి చిలవలు పలవలూ చేర్చి చెప్పారు ఇదంతా ఆ రహీమే చేయిస్తున్నాడని నూరిపోశారు.

వాళ్ళమాటలు అతని తలకు ఎక్కాయి. పగతో, ప్రతీకారవాంఛతో ఆవేశంగా వూగిపోయాడు.

అతనికి వాళ్లు ఒక కత్తికూడ యిచ్చిపోయారు...

ఈ మనుషులే మళ్లీ వేషంమార్చి, భాష మార్చి రహీం దగ్గరికి వెళ్ళారు.

బలరాంకు నూరిపోసినట్లే రహీంకు కూడ నూరిపోశారు. ఫకీరయ్యను పొడిపించింది బలరామే అని నమ్మపలికారు. రహీంలోకూడ ద్వేషాగ్నిని రగిలించారు-మతావేశాన్ని కలిగించారు. అతడ్ని చంపటానికి బలరాం కత్తి బొడ్లో పెట్టుకొని

తిరుగుతున్నాడని చెప్పారు రహీంకు కూడ ఒక కత్తి యిచ్చారు

ఈ విధంగా ఈ కుట్రదారులు ప్రాణ మిత్రులు మధ్య మతదురాభిమానాన్ని రెచ్చ కొట్టారు, వాళ్ళిద్దరూ ఒకరి నొకరు పొడు చుకు చావటానికి కావల్సిన రంగాన్ని సిద్ధం చేశారు.

ఇక ఈ స్నేహితులిద్దరూ కత్తులు దూస్తే ఈ బస్తీ మొత్తం పీనుగులదిబ్బ అవుతుందని తృప్తిగా నవ్వుకున్నారు- ఈ దేశద్రోహులు !

ఆ రాత్రంతా వాళ్ళిద్దరూ ఒకర్ని ఒకరు ఎలా మట్టుపెట్టాలా అని ఆలోచనలు చేస్తూ గడిపారు

తెల్లవారింది.

లోకానికంతా వెలుగు వచ్చింది- వీళ్ళిద్దర్ని మాత్రం 'పగ' అనే చీకటి ముసిరింది.

తెల్లవారిన దగ్గర్నుంచి రహీం బలరాం కోసం కాపుకాశాడు, అతని కోసం తనకు తెలిసినచోటల్లా వెతికాడు బలరాం జాడ లేదు

పదకొండు గంటలప్పుడు బలరాం వుస్మానియా ఆసుపత్రి దగ్గర కనిపించాడని ఎవరో చెప్పారు.


కిరాయిసైకిలు తీసికొని ఆసుపత్రికి వెళ్ళాడు.

బలరాం లోపల్నుంచి బయటికి రాగానే కత్తితో పొడిచేయాలని- ఆసుపత్రి ఆవరణలో రహీం పొంచివున్నాడు

ఆ సమయంలో బలరాం జనరల్ వార్డులో వున్నాడు; ఎందుకో మధ్యలో కిటికీ దగ్గరకు వచ్చాడు.

కిటికీలోంచి బయటవున్న రహీం కనిపించాడు

రహీంను చూడగానే బలరాంలో 'పగ,



పడగ ఎత్తింది. ఆవేశం బుసకొట్టింది. అప్రయత్నంగా అతని చెయ్యి బొడ్లోవున్న చాకుని తడిమింది.

'ఈడకే వచ్చావా బిడ్డా! రా, ఇయ్యాళ నీ చావు మూడింది!'-అని తనలో తాను గొణుక్కున్నాడు. పళ్ళు పటపటలాడించాడు.

బయట రహీం బీడీమీద బీడీ కాలుస్తూ అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తోన్నాడు...

ఇంతలో గేటు దగ్గర షరీఫ్ కనిపించాడు అన్నం టిఫిన్ తీసుకొని లోపలికి వస్తున్నాడు...

రహీం షరీఫ్‌ని పలకరించాడు. ఫకీరయ్య గురించి అడిగేడు

ఫకీరయ్యకు ఇంకా స్పృహరాలేదనీ ఇంకా ప్రమాదస్థితిలోనే వున్నాడనీ షరీఫ్ చెప్పాడు.

ఫకీరయ్యను చూడటానికి షరీఫ్ వెంట లోపలికి వెళ్ళాడు-రహీం.

అదను దొరికితే బలరాంను ఆసుపత్రి లోపలే పొడిచేసి కిటికీలోంచి దూకి పారిపోదామని ఆలోచిస్తూ... షరీఫ్ వెనకాల నడుస్తూన్నాడు-రహీం.

ఇద్దరూ ఫకీరయ్య పడుకున్న మంచం దగ్గరకు వచ్చారు.

మంచంచుట్టూ మనుషులు మూగి వున్నారు

యాదమ్మా యాదమ్మభర్త కొండయ్య కూడ వున్నారు.

ఫకీరయ్య పరిస్థితి చాల ఆందోళనకరంగా వుంది. యాదమ్మ వూరికే బెంబేలు పడిపోతూంది

ఫకీరయ్యను పరీక్షిస్తోన్న డాక్టర్లు అతనికి అర్జంటుగా రక్తం ఎక్కించాలన్నారు

యాదమ్మ భర్త కొండయ్య తన రక్తం ఇవ్వటానికి ముందుకొచ్చాడు.

సరిగ్గా ఇదే సమయానికి బలరాం కూడ అక్కడికి వచ్చాడు

కొండయ్య ఔదార్యానికి రహీం కళ్ళు చెమ్మగిల్లాయి. అతని గుండెల్లో తడి పూరింది. గుండె పొరల్లోంచి సన్న నిరొద మొదలయింది

ఇంతలో ప్రక్కనున్న షరీఫ్-'వస్తా భాయి! మా లచ్చమ్మక్కకు భోజనం యేళయిందీ!' అన్నాడు.

షరీఫ్ అన్న యీ మాట విని వులిక్కిపడ్డాడు రహీం

తాను విన్నమాటను నమ్మలేక-'ఏంటీ? నీవు అన్నం తెచ్చింది లచ్చమ్మకా? మన ఫకీర్‌సాబ్‌కు కాదా?' ఆశ్చర్యంగా రెట్టించి అడిగాడు.

బలరాం కూడ షరీఫ్ వంక ఆశ్చర్యంగా చూశాడు. లచ్చమ్మ వెనకా ముందూ ఎవరూలేరు షరీఫ్ తనింటి దగ్గర్నుంచి రెండు పూటలా ఆమెకు భోజనం తీసికొస్తున్నాడు.

ఈ మాట వినగానే బలరాం చలించిపోయాడు. అతని గుండెల్లో ఏదో 'కదలిక' సన్నగా మొదలయింది

లచ్చమ్మను ఆసుపత్రికి తిసికొచ్చి జాయిన్ చేసింది కూడ షరీఫ్ అన్న సంగతి బలరాంకు తెలియదు

ఇప్పుడే తెల్సింది...

షరీఫ్ ఓదార్యానికి బలరాం చలించిపోయాడు. నివ్వెరపోయాడు. నిశ్చేష్ట

డయ్యాడు

అతన్లో లేచిన ఆలోచనాతరంగాలు అతని హృదయాన్ని తాకాయి...

ఈ షరీఫ్ ఎవరు? ఆ లచ్చమ్మ ఎవరు?

షరీఫ్‌ది ఏం మతం?

లచ్చమ్మది ఏం మతం?

వీరిద్దరూ వేరు వేరు మతాలవారయితే మరి వీళ్ళిద్దర్నీ కలిపిందేమిటి?

ఏం మతం వాడని కొండయ్య ఫకీరయ్యకు రక్తం ఇవ్వడానికి సిద్ధపడ్డాడు?

తన మనసు తనని నిలేసిఅడుగుతున్న ప్రశ్నలు ఇవి!

తల ఎత్తి రహీం వంక చూశాడు-

రహీం పరిస్థితికూడ ఇలాగే వుంది!

అతని మనస్సుకూడ అతనిమీద తిరగబడుతూంది...

గిట్టనివాళ్ళూ-తమ చెలిమిచూచి కన్నుకుట్టినవాళ్లూ తమను రెచ్చగొట్టి, తమ తలకు ఎక్కించిన మతం అనే మత్తుమందు కొంచెం కొంచెం దిగుతూంది... ఇద్దరికీ!

ఇద్దర్లోనూ మానవత్వం అప్పుడప్పుడే కళ్ళు తెరచి మేల్కొంటూంది... వాళ్ళ కళ్ళకు కట్టిన మతదురభిమానమనే పొరలు విడుతూవున్నాయి...

ఒకరి వెనుక ఒకరు నడుచుకుంటూ మౌనంగా బయటికి వచ్చారు.

ఆసుపత్రి ఆవరణలో వున్న పెద్ద మర్రిచెట్టుక్రింద ఇద్దరూ నిలబడ్డారు.

ఇద్దరూ సిగ్గుతో తలలు వాల్చుకుని వున్నారు.

తల ఎత్తి ఒకరివంక ఒకరు చూడటానికి మొగం చెల్లటంలేదు.

పశ్చాత్తాపంతో వాళ్ళిద్దరి హృదయాలు దహించుకుపోతున్నాయ్.

ఎలాగో ఇద్దరూ తలలుఎత్తి పరస్పరం చూచుకున్నారు. ఆవేశంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు-

బొడ్లో దాచుకున్న కత్తులుతీసి అవతల పారేశారు-

చేతులు కలిపారు-

మళ్ళీ భాయి-భాయి' అనుకున్నారు.

మంచంకంటె మానవత్వమే గొప్పదని తెలుసుకున్నారు-

రాముడైనా-రహీం అయినా అదేమొక్కటే అని-

భగవద్గీతయినా, ఖురాన్ అయినా, మందిరంలో అయినా మస్జిద్‌లో అయినా చెప్పేదొక్కటే అని మనిషిని మనిషిగా చూడమనీ

మానవతను మించిన 'మతం' లేదనీ వాళ్ళిద్దరూ తెలుసుకున్నారు.

ఇక ఏ శక్తీ తమని విడదీయలేదని ఏ కుటిల కుతంత్రం తమమధ్య పని చేయలేదని శపథం చేశారు

ఒకరి భుజంమీద ఒకరు చేతులు వేసుకుని నగరంవయిపుకి సాగిపోయారు...

ఇప్పుడు వాళ్ళ మనస్సులో వున్నది ఒక్కటే. మనిషిని మనిషినీ కలిపే మహోన్నతమైన మానవత!

—ఇప్పుడు వాళ్ళు జపిస్తోంది ఒక్కటే 'ఈశ్వర అల్లా తేరేనామ్!'

—ఇప్పుడు వాళ్ళు కోరుతున్నది ఒక్కటే: 'సర్వేజన సుఖినోభవతు!' *